క్లుప్తంగా

దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్


మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

రాయదుర్గం: ప్రభుత్వం నూతన మద్యం పాలసీ నోటిఫికేషన్‌ను విడుదల చేయడంతో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రాయదుర్గం ఎక్సైజ్ ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఎస్ఐగా ఆయన బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ హరికృష్ణ, కెనరా బ్యాంకు ఉద్యోగి రమేష్‌తో కలిసి శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతన మద్యం పాలసీపై వివరించారు. రాయదుర్గం ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని ఎనిమిది దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్బన్‌లో 5, రూరల్ 1, డీహీరేహాళ్ 1, గుమ్మఘట్ట 1 మద్య షాపులు కొత్తగా ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ అర్బన్‌లో రూ.65 లక్షలు, రూరల్‌లో రూ.55 లక్షలు సుంకం చెల్లించాల్సి ఉందన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 9న సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉంటుందన్నారు. దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్ అందుబాటులోకి తీసుకోచ్చామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ హరి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం సురక్షితం


పీహెచ్‌సీలో ప్రసవం అనంతరం శిశువును పరీక్షిస్తున్న వైద్యాధికారిణి సౌమ్యా రెడ్డి

కూడేరు: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం సురక్షితమని మండల వైద్యాధికారిణి సౌమ్యారెడ్డి తెలిపారు. శుక్రవారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని (పీహెచ్‌సీ)కి పలువురు గర్భిణులు పురిటి నొప్పులతో వచ్చారు. మండల వైద్యాధికారిణి వారిని పరీక్షించారు. గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించి, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు యశోద, రవీంద్ర, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మీ, మల్లీశ్వరి సూచించారు. శుక్రవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో డెంగీ, మలేరియా, సీజనల్ వాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగమణి, ఆరోగ్య కార్యకర్తలు గోవర్దన, శశికల, రమాదేవి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రైతులకు పండ్లతోటల అభివృద్ధి నిధులు

కుందుర్పి: మండల వ్యాప్తంగా పండ్లతోటలు సాగు చేసిన రైతులకు అభివృద్ధి నిధులు అందజేస్తున్నట్లు కుసుమగిరి రైతు సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీపతి, కోఆర్డినేటర్ నరసింహమూర్తి తెలిపారు. శుక్రవారం మలయనూరు, బండమీదపల్లి, తమ్మయ్యదొడ్డి తదితర గ్రామాల్లో పండ్లతోటలు సాగు చేసిన రైతులను గుర్తించి, గుర్తింపు కార్డులు, నమోదు పత్రాలు అందించారు.

నల్ల బ్యాడ్జీలతో తపాలా సిబ్బంది నిరసన


రెండో రోజు నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

కంబదూరు: మండల కేంద్రంలోని తపాలా శాఖ కార్యాయలయం వద్ద పోస్టల్ సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం రెండోరోజు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాసులు, మల్లేశయ్య, సుదర్శన్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి


మృతి చెందిన ఎద్దు

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు గ్రామ శివారులో పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందింది. వివరాలు..ఉంతకల్లుకు చెందిన రైతు నాగన్న శుక్రవారం ఎడ్లబండి కట్టుకొని పొలానికి వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఉరుములు,మెరువులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఇదే సమయంలో సమీపంలో చెట్టుపై పిడుగు పడింది.దీంతో పిడుగుపాటుకు ఒక ఎద్దు మృతిచెందింది. రూ. 50 వేలు నష్టపోయినట్లు బాధిత రైతు తెలిపాడు.

కేశవా.. మా కష్టాలు చూడవా

- మంత్రి పయ్యావుల ఇలాకాలో రేషన్ కోసం కార్డుదారుల అవస్థలు
- చౌకదుకాణాల వద్ద తెల్లవారుజాము నుంచే పడిగాపులు
- నిత్యావసరాల్లో కంది పప్పు, చక్కెర కోత
- కూటమి ప్రభుత్వ తీరుపై భగ్గుమంటున్న ప్రజలు


ఉరవకొండలోని లక్ష్మీనృసింహస్వామి కాలనీలోని రేషన్‌షాపు వద్ద క్యూలో రేషన్‌కార్డులు పెట్టిన దృశ్యం


ఉరవకొండలోని 11వార్డు పార్కు ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని ఓ రేషన్‌షాపు వద్ద ఉదయం 6 గంటలకే క్యూలో ఉన్న కార్డుదారులు

ఉరవకొండ: స్వయానా రెవెన్యూశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సొంత నియోజకవర్గంలో రేషన్‌కార్డుదారులకు కష్టాలు 'వరుస'కట్టాయి. పండుగ పూట పస్తులు తప్పేటట్లు లేవు. పేదలకు రేషన్ అందక అవస్థలు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రేషన్ కష్టాలు ఎక్కడా వినిపించేవి కాదు. ఎండీయూ వాహనం ద్వారా ఇళ్ల వద్దనే పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత చౌక డిపోల ద్వారా పంపిణీ చేస్తుండడంతో కార్డుదారులకు కష్టాలు మొదలయ్యాయి. నిత్యావసర సరుకుల్లో కోత పెట్టారు. రేషన్ కోసం ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

నియోజకవర్గంలో 80 శాతం రేషన్‌షాపులు తెరుచుకోకపోవడంతో కార్డుదారులు మిగిలిన 20 శాతం షాపుల వద్దకు ప్రజలు పరుగులు తీస్తున్నారు. నియోజకవర్గంలో 142 రేషన్‌షాపులు ఉండగా, 63,400 రేషన్‌కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా 1వ తేదీ ప్రారంభం కావాల్సిన రేషన్ పంపిణీ నేటికీ 20 శాతం కూడా ప్రారంభం కాలేదు.

చౌకదుకాణాల వద్ద కార్డుదారుల తిప్పలు: వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో ఇంటి వద్దకే ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు రేషన్ అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఇంటింటికీ రేషన్ అందించే కార్యక్రమానికి మంగళం పాడింది. కార్డుదారులు చౌక ధరల దుకాణాలకు వెళ్లి బియ్యం, నిత్యావసరాలు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. రేషన్‌షాపుల వద్ద భారీ క్యూలైన్లు వెలిశాయి. పండుగ పూట ఇంట్లో పనులు కూడా వదిలేసుకొని మహిళలు తెల్లవారుజాము నుంచే రేషన్ కోసం నిరీక్షించాల్సి పరిస్థితి నెలకొంది. వృద్ధులు క్యూలో నిలబడలేక అవస్థలు పడుతున్నారు.

పండుగ పూట రేషన్ సరుకుల్లో కోత: చంద్రబాబు ప్రభుత్వం వచ్చీరాగానే రేషన్ సరుకుల్లో కోత విధించింది. ఈఏడాది జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కందిపప్పు, పంచదార పంపిణీ నిలిపివేసింది. దసరా పండుగ నేపథ్యంలో అక్టోబర్‌లో పంచదార, కందిపప్పుతోపాటు జొన్నలు అందించడానికి నిర్ణయం తీసుకున్నా, చాలా మంది డీలర్లు పంచదార, కందిపప్పుకు డీడీలు కట్టపోవడంతో రేషన్ షాపుల్లో వీటిని అందించలేదు.

ఒక్కరూ పట్టించుకోవడం లేదు


రేషన్ బియ్యం కోసం గత వారం రోజులుగా అవస్థలు పడుతున్నా ఒక్క అధికారి కూడా పట్టించుకోవడం లేదు. కార్డులు రోడ్డు మీద పెట్టి లైన్లో వేచి ఉన్నా బియ్యం అందడం లేదు. ఎండలో కూర్చోలేక అవస్థలు పడుతున్నాం.

– పూలలక్ష్మి, లక్ష్మీనృసింహస్వామి కాలనీ, ఉరవకొండ

ఇంటి వద్దకే పంపిణీ బాగుండేది..


వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఇంటివద్దకే రేషన్ అందించారు. క్యూలో నిలబడాల్సిన పని లేకుండా ప్రశాంతంగా పంపిణీ చేశారు. ఎలాంటి కష్టం లేకుండా మాలాంటి ముసలోళ్లకు బియ్యం అందించి ఆదుకున్నారు. ఇప్పుడు గతంలో బియ్యం కోసం పడిన అవస్థలను మళ్లీ పడేలా చేస్తున్నారు, ఇంటి వద్దకే బియ్యం ఇచ్చి పుణ్యం కట్టుకోవాలి.

– పార్వతీ, డ్రైవర్స్‌కాలనీ, ఉరవకొండ

కందిపప్పు, చక్కెర లేదంటున్నారు


రేషన్ షాపుల్లో కేవలం బియ్యం ఒక్కటే అందిస్తున్నారు. బ్యాళ్లు, చక్కెర లేదంటున్నారు.పండు పూట కుడా నిత్యవసరాల్లో కోత విధిస్తే ఎం తినాలి. ఇప్పుడు పింఛన్, రేషన్ బియ్యం కోసం పడిగాపులు తప్పడం లేదు. గత ప్రభుత్వం మాదిరిగా బియ్యం ఇంటివద్దకే అందిస్తే బాగుంటుంది.

– శ్రీనివాస్, ఉరవకొండ

త్వరితగతిన సమస్య పరిష్కరిస్తాం


రేషన్ షాపుల్లో నిత్యావసర సరుకులు ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. కందిపప్పు, చక్కెర కూడా కార్డుదారులకు ఇవ్వాలని డీలర్లకు ఆదేశాలు జారీ చేశాం. ఎక్కడైనా డీలర్లు సక్రమంగా అందించకపోతే వారిపై చర్యలు తీసుకుంటాం.

– మహబూబ్‌బాషా, తహసీల్దార్, ఉరవకొండ

'కొల్లరి' హత్యకేసు విచారణ వేగవంతం

రాయదుర్గం: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న హెచ్.కొల్లారప్ప (కొల్లారి) ఇటీవల కణేకల్లు రోడ్డు గౌడ లేఔట్ సమీపంలోని జగనన్న కాలనీలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం విదితమే. ఈ కేసు దర్యాప్తులో వేగం పెంచిన పోలీసులు ఆసక్తికర విషయాలు వెలికితీశారు. ఆత్మహత్య కాదు..హత్యగా నిర్ధారణ కాగానే పలు కోణాల్లో విచారణ ప్రారంభించారు. కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, సీఐ జయకుమార్ నేతృత్వంలో పోలీస్ టీమ్‌లు రంగంలోకి దించారు. నిందితులను గుర్తించేందుకు మూడురోజులుగా రాత్రీపగలు శ్రమించారు. కాల్‌డేటా ఆధారంగా ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలతో పాటు అర్బన్ పీఎస్‌లో సుమారు 60 మందికిపైగా అనుమానితులను విచారించినట్టు సమాచారం. పోలీసులు ప్రధాన నిందితులతో హత్యకు గల కారణాలను రాబడుతున్నారు. మిస్టరీగా మారిన హత్య కేసును పోలీసులు కొలిక్కి తెస్తున్నారు.

ఉచిత ఇసుక హామీ అమలు చేయాలి


తహసీల్దార్ కార్యాలయంలో డీటీ కుళ్లాయప్పకు వినతపత్రం అందిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని సీపీఎం నాయకులు డీటీ కుళ్లాయప్పకు శుక్రవారం వినతిపత్రం అందించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలో కొచ్చి వందరోజులయ్యింది.. ఎక్కడ కూడా ఉచిత ఇసుక విధానం అమలు కాలేదన్నారు. కళ్యాణదుర్గంలో ఇసుక అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత ఇసుక విధానం పక్కాగా అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రంగనాథ్, నాయకులు ఈశ్వర్, గోవిందప్ప, రఘు, నరేష్, హనుమంతు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: అధికారంలోకి వస్తే ఉచితంగా ఇసుక అందిస్తామన్న మాట నిలుపుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ మహబూబ్ బాషాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, నారాయణ రెడ్డి, వీరన్న, సుంకే నాయక్, అరుణమ్మ, రామక్క తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల కంపల్లో అంగన్‌వాడీ పాలు


ముళ్ల కంపల్లో పడేసిన అంగన్‌వాడీకి అందించే పాలు,మందులు

కళ్యాణదుర్గం: పట్టణంలోని ముళ్ల కంపల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే పాల ప్యాకెట్లు శుక్రవారం రాత్రి కనిపించాయి. కోటవీధి సమీపంలోని బాలికోన్నత పాఠశాల వెనుకవైపున ముళ్ల కంపల్లో అంగన్‌వాడీ పాల ప్యాకెట్లను పడేసిన దృశ్యాలను అటుగా వెళ్తున్న స్థానికులు గుర్తించారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అంగన్‌వాడీ వ్యవస్థపై నిర్లక్ష్యం వహిస్తోందని, ఇందుకు ఈ ఘటనే నిదర్శనమని స్థానికులు చర్చించుకుంటున్నారు. చిన్నారులకు అందించే పారాసిటమాల్, దగ్గు, జలుబు టానిక్‌లను సైతం పడేశారు. సమీపంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, ఏ కేంద్రం నుంచి తీసుకొచ్చి పడేశారోనని స్థానికులు అంటున్నారు.

రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రసాద్


కూడేరు: మండల రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రసాద్‌ను ఉన్నతాధికారులు నియమించారు. దీంతో శుక్రవారం డీటీగా బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న విజయ కుమార్ పామిడి మండలానికి బదిలీపై వెళ్లారు.

రీ సర్వే డీటీగా పీసీ కుళ్లాయప్ప


కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మండలం రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పీసీ కుళ్లాయప్ప బాధ్యతలు తీసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో విధుల్లో చేరారు. కుందుర్పి తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న ఈయన రీ సర్వే డీటీగా బదిలీపై కళ్యాణదుర్గానికి వచ్చారు.

డీలర్లపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

కుందుర్పి: దసరా పండుగ ముసుగులో కొత్తగా చేరిన చౌకధాన్యపు డీలర్లు చక్కెర, కందిపప్పును అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు మండల సమాచార హక్కు చట్టం సభ్యులు, కుందుర్పి ప్రజలు తహసీల్దార్ శ్రీనివాసులుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. రూ.17కు అందజేయాల్సిన కిలో చక్కెర రూ.20, రూ.67కు విక్రయించాల్సిన కందిపప్పు రూ.80కి విక్రయిస్తున్నట్లు వారు ఫిర్యాదులో తెలిపారు. కుందుర్పి మండల కేంద్రంతో పాటు 13 గ్రామ పంచాయతీల్లోనూ డీలర్లు ఇలానే విక్రయిస్తున్నట్లు తెలిపారు.

8న జాబ్‌మేళా

కళ్యాణదుర్గం రూరల్: బోరంపల్లి సమీపంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 8న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వెంకటప్రతాప్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు విద్యార్హత సర్టిఫికెట్లతో జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు.

కంబదూరులో అపరిచిత వ్యక్తుల హల్‌చల్

కంబదూరు: మండల కేంద్రంలోని వడ్డే కాలనీలో మూడు రోజులుగా అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తుండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. గురువారం అర్ధరాత్రి కూడా కాలనీలోని పలువురి ఇళ్ల తలుపును తట్టారు. ఎవరని బయటకు వచ్చి చూస్తే కత్తులు చూపిస్తూ బెదిరిస్తున్నారని మహిళలు చెప్పారు. ఓ మహిళ గొంతును దుండగులు పట్టుకోగా, ఆమె ఎలాగోలా వారి నుంచి విడిపించుకొని గట్టిగా కేకలు వేయడంతో పరారైనట్లు తెలిపింది. పోలీసులు రాత్రి పూట గస్తీ నిర్వహించి, అపరిచితుల నుంచి కాపాడాలని స్థానిక మహిళలు కోరుతున్నారు.


అపరిచిత వ్యక్తుల గురించి చెప్తున్న కంబదూరు వడ్డేకాలనీకి చెందిన మహిళలు

సకల చరాచర సృష్టికారిణీ నమోస్తుతే!


రాయదుర్గంటౌన్: పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం విశేష పూజలు జరిగాయి. కోటలో వెలసిన నగరేశ్వరి, ఓబుళాచారి రోడ్డులోని మహంకాళి, శాంతినగర్‌లోని పెద్ద బన్ని మహంకాళి ఆలయాల్లో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. హటకేశ్వరస్వామి ఆలయం, కోటలోని కంసలవీధి కాళికాంబదేవి, లక్ష్మీబజారులోని శ్రీముదుగులమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. బొమ్మక్కపల్లిలోని రాజరాజేశ్వరిదేవికి భక్తులు పూజలు చేశారు.

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెరలోని వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళీ అమ్మవారు గాయత్రిదేవీ అలంకరణలో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో స్వామికి గంగపూజ, ధ్వజస్తంభం, గోపుర కలశహోమాలు, రక్షాబంధనం, మహామంగళారతి తదితర పూజలు చేశారు.

కంబదూరు: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా ఆలంకరించి గంగ, ఆకు పూజ, పంచామృతాభిషేకం, కుంకమార్చన, హోమం, మంగళ హారతులు చేశారు.


కణేకల్లులో మహాలక్ష్మీ అలంకరణ


ఉరవకొండ:ఉరగాద్రి చౌడేశ్వరి అమ్మవారు


ఉరవకొండలో గాయత్రీదేవి


కంబదూరు: కన్యకాపరమేశ్వరిదేవి


గుమ్మఘట్టలో భద్రకాళీ అమ్మవారు

గాయత్రీదేవి అలంకరణలో ఉరగాద్రి చౌడేశ్వరీ

ఉరవకొండ: ఉరవకొండలో ప్రసిద్ధిగాంచిన ఉరగాద్రి చౌడేశ్వరి, జగదీశ్వరి ఆలయాల్లో అమ్మవారు గాయత్రీదేవిగా శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు ఆలయ ధర్మకర్త గాజుల శ్యామలమ్మ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

వజ్రకరూరు:స్థానిక శ్రీ లలితాత్రిపుర సుందరీదేవి ఆలయంలో శరన్నవ రాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని రెండోరోజు శుక్రవారం బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కణేకల్లు: కణేకల్లులోని దుర్గాదేవీ, కనకదుర్గ ఆలయాల్లో అమ్మవారు రెండో రోజు మహాలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనిమిచ్చారు.

కుందుర్పి: కుందుర్పి లక్ష్మీనృసింహ ఆలయం, కోదండ రామస్వామి ఆలయం, నాగేపల్లి యల్లమ్మ ఆలయం, బెస్తరపల్లి సవారమ్మ ఆలయం, కదరంపల్లి దుర్గాదేవి ఆలయాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు జరిగాయి.


రాజరాజేశ్వరీదేవి ఆలంకరణలో వాసవీమాత

ఉరవకొండ ఎంపీడీఓగా రవి ప్రసాద్ బాధ్యతల స్వీకరణ


ఉరవకొండ: ఉరవకొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా రవిప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆగళి ఎంపీడీఓగా ఉన్న ఆయన బదిలీపై ఉరవకొండకు వచ్చారు. ఎంపీడీఓను గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు.

కూడేరు ఎంపీడీఓగా కుళ్లాయిస్వామి


కూడేరు: మండల ఎంపీడీఓగా కుళ్లాయిస్వామిని ఉన్నతాధికారులు నియమించారు. దీంతో శుక్రవారం ఆయన ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛాలు అందించి,శుభాకాంక్షలు తెలియజేశారు. ఈయన పెద్దవడుగూరు మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ


ఎంపీడీఓ రామచంద్ర

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం ఎంపీడీఓగా రామచంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసున్న సాల్మన్ కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్లారు. బెలుగుప్ప మండల ఎంపీడీఓగా పని చేస్తున్న రామచంద్ర ఇక్కడికి వచ్చారు.

ఈఓఆర్డీగా దామోదర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ


వజ్రకరూరు: మండలం ఈఓఆర్డీగా జి.దామోదర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఓఆర్డీ సదాశివ బుక్కరాయసముద్రం మండలానికి బదిలీ అయ్యారు. ఆత్మకూరు మండలంలో పని చేస్తున్న దామోదర్‌రెడ్డిని ఇక్కడికి బదిలీ చేశారు.

గ్రామకార్యదర్శుల నియామకం

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాలకు కార్యదర్శులను నియమించారు. వజ్రకరూరు గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీధర్‌రావు అనంతపురానికి బదిలీ అయ్యారు. కర్నూలు జిల్లాలో పనిచేస్తున్న మల్లయ్య వజ్రకరూరుకు బదిలీ అయ్యారు. రాగులపాడు కార్యదర్శి అంజి పెద్దవడుగూరుకు బదిలీ కాగా, గుంతకల్లులోని పనిచేస్తున్న కృష్ణారెడ్డి రాగులపాడుకు బదిలీ అయ్యారు. చాబాల కార్యదర్శి వెంకటేశులు దర్గాహోన్నూరుకు బదిలీ అయ్యారు. ఉరవకొండ నుంచి నాగరాజు చాబాలకు బదిలీ అయ్యారు. గంజికుంట గ్రామకార్యదర్శి భీమాంజనేయ నెలగొండ కు బదిలీ అయ్యాడు. కరకముక్కల కార్యదర్శి వైఎం. లలితమ్మ గంజికుంటకు, కమలపాడు గ్రామకార్యదర్శి నాసిర్‌బాషా వైటీ చెరువుకు, బెళుగుప్ప మండలం శీర్పి గ్రామ కార్యదర్శి వెంకటేశులు కమలపాడుకు బదిలీ అయ్యారు.

కూడేరు పంచాయతీ కార్యదర్శిగా రమాదేవి

కూడేరు: కూడేరు పంచాయతీ కార్యదర్శిగా రమాదేవి నియమితులయ్యారు. దీంతో శుక్రవారం కార్యదర్శిగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈమె ముదిగుబ్బ మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ప్రభావతి బదిలీ అయ్యారు.

గొటుకూరు వీఆర్‌ఓగా కుళ్లాయిస్వామి

కూడేరు: గొటుకూరు వీఆర్వోగా కుళ్లాయిస్వామిని ఉన్నతాధికారులు నియమించడంతో శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈయన పెద్దవడుగూరు మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న రుక్మిణి గుత్తి మండలానికి బదిలీపై వెళ్లారు.

పంచాయతీ కార్యదర్శులు రిలీవ్

కూడేరు: మండలంలో పనిచేస్తూ బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం రిలీవ్ అయ్యారు. మరుట్ల పంచాయతీ కార్యదర్శి మగ్బుల్ బాషా, ఉదిరిపికొండ కార్యదర్శి శివరంజని, కొర్రకోడు కార్యదర్శి లక్ష్మీనారాయణ, కమ్మూరు కార్యదర్శి మురళీ రిలీవ్ అయిన వారిలో ఉన్నారు. వీరి స్థానాల్లోకి నూతన కార్యదర్శులు బాధ్యతలు చేపట్టాల్సి ఉంది.